
సాక్షి పల్నాడు
బుధవారం ı 4 ı జనవరి ı 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 727 క్యూసెక్కులు నిల్వ ఉంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.4353 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

సజావుగా పింఛన్ల పంపిణీ

జిల్లాలో మూడో రోజు 96.45శాతం



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ మూడో రోజైన మంగళవారం సజావుగా సాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. మంగళవారం లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరీష్ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో మూడో రోజు 96.45 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,54,123 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.81 కోట్లు కేటాయించింది. మంగళవారం సాయంత్రానికి 2,45,090 మంది లబ్ధిదారులకు రూ.67.31 కోట్ల నగదు అందజేశారు.

ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరుమెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎలక్ట్రిషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ లిస్టును శనివారం విడుదల చేశారు. గత ఏడాది నవంబరులో ఎలక్ట్రిషియన్ ఉద్యోగులకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అభ్యర్థులు ఫైనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు తెలిపారు.


సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పాతగుంటూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 6 నుంచి 14 వరకు 132 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి జి.విజయగీత మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరుకు 55 బస్సులు, తెనాలికి 16 బస్సులు, మంగళగిరికి 10 బస్సులు, పొన్నూరుకు 15 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరు నుంచి ఆరు బస్సులు, చెన్నై నుంచి నాలుగు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో 16వ తేదీ నుంచి 19 వరకు 106 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు 73 బస్సులు, తెనాలి నుంచి 10 బస్సులు, మంగళగిరి నుంచి 9 బస్సులు, పొన్నూరు నుంచి 14 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి బెంగళూరుకు తొమ్మిది బస్సులు, చెన్నైకు ఐదు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 579.10 అడుగుల వద్ద ఉంది. ఇది 280.4096 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 9,160, ఎడమ కాలువకు 8,807, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,767 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 10,711 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 856.40 అడుగుల వద్ద ఉంది. ఇది 95.5900 టీఎంసీలకు సమానం.

యార్డుకు 40,949 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 40,949 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,385 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.12,700 నుంచి రూ.26,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.12,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,558 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.





గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం జరిగిన సంక్రాంతి కానుకల పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నిర్మలమ్మను, మృతురాలు రమాదేవి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాలి గిరి, మేయర్ కావటి –సాక్షి, నెట్‌వర్క్

జెడ్పీ బడ్జెట్ రూ.61.26 కోట్లు

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదిత అంచనా బడ్జెట్‌కు ఆమోదం
- జెడ్పీలో ఏడు స్థాయీ సంఘాలు భేటీ
- ఫిబ్రవరిలో జరిగే సర్వసభ్య సమావేశంలో బడ్జెట్ ఆమోదం లాంఛనమే



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీఈవో శ్రీనివాసరెడ్డి, సభ్యులు

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.61.26 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆమోదించారు. మంగళవారం జెడ్పీలో ఏడు స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. వీటిలో 1, 2, 4, 7వ స్థాయీ సంఘాలకు అధ్యక్షత వహించిన హెనీ క్రిస్టినా వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సభ్యులతో చర్చించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఛాంబర్లో ప్రణాళిక–ఆర్థిక అంశాలపై జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.53.14 కోట్ల సవరణ బడ్జెట్‌ను ఆమోదించారు. ఇందులో గత ఆర్థిక సంవత్సరానికి ఆదాయ, వ్యయాలు పోను రూ.36.56 లక్షలు మిగులు చూపారు. స్థాయీ సంఘంలో ఆమోదం పొందిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరిలో జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందాల్సి ఉండగా, పాలకవర్గానికి అది లాంఛనమే. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.25 కోట్ల మేరకు రావాల్సి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని హెనీ క్రిస్టినా అన్నారు. గనుల శాఖ నుంచి రూ.15 కోట్ల మేరకు ఇసుక సీనరేజీ నిధులు పెండింగ్‌లో ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. ఇసుక సీనరేజీ నిధుల విడుదల చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి విజ్ఞప్తి చేయగా, ఆయన నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు.

పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పనితీరుపై అసంతృప్తి

జెడ్పీ సీఈవో డాక్టర్ జె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, తాగునీటి పనులకు జెడ్పీ నుంచి నిధులు ఇస్తామని చెప్పినా పనులు చేపట్టడంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. రోడ్లు, తాగునీరు, కాలువలకు సంబంధించిన పనులపై పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఆయన స్పందించారు.

సంక్రాంతి సెలవుల తర్వాత టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు సంక్రాంతి సెలవుల తర్వాత సాయంత్రం పూట అల్పాహారాన్ని అందించనున్నట్లు హెనీ క్రిస్టినా చెప్పారు. విద్య–వైద్యంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జనవరి 20 నుంచి అల్పాహారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ ద్వారా గుంటూరు జిల్లా పరిషత్ రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందని, ఇందుకు జెడ్పీ పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కొల్లిపర మండలం మున్నంగి జెడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడు గత మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై పౌర గ్రంథాలయశాఖలో పనిచేస్తున్న విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈవో పి.శైలజ విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. భట్టిప్రోలు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులు లేరంటూ జెడ్పీటీసీ లేవనెత్తిన అంశంపై బాపట్ల డీఎంహెచ్‌వో సమాధానమిచ్చిన తీరుపై చైర్‌పర్సన్ తోపాటు సీఈవో శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో జెడ్పీటీసీలకు ఆహ్వానం లేకపోవడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అధికారులను హెచ్చరించారు. పల్నాడు జిల్లాలో ఉపాధ్యాయుల కొరతపై చర్యలు చేపట్టాలని డీఈవో ఎం.వెంకటప్పయ్యకు సూచించారు. ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులకు సంబంధించిన స్థాయీ సంఘాలు హెనీ క్రిస్టినా అధ్యక్షతన భేటీ కాగా, వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరిగాయి. ఆయా సమావేశాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అన్నారు. గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేని రీతిలో పెద్దఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టిన విషయాన్ని, ప్రత్యక్షంగా చూస్తే తెలుస్తుందని పేర్కొన్నారు.

జెడ్పీటీసీ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు

తమ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని పలువురు స్థాయీ సంఘ సభ్యులు చైర్‌పర్సన్‌ను కోరారు. కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ సీఈవో మాట్లాడుతూ ప్రతి జెడ్పీటీసీ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. నాడు–నేడు ద్వారా ఆధునీకరించిన జెడ్పీ పాఠశాలల్లో రాత్రి కాపలాదారులను నియమించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు చెప్పారు. త్వరలోనే ఆచరణలోకి రానుందన్నారు.

మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: విద్య ద్వారానే సమాజంలో ఉన్న అసమానతలను తొలగించవచ్చని మహిళా విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్‌లో సావిత్రీ బాయి పూలే జయంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి రజిని మాట్లాడుతూ భర్త జ్యోతిబా పూలే ప్రోత్సాహంతో చదువుకున్న సావిత్రీబాయి దేశంలో మహిళా విద్యకు దారి చూపారని కొనియాడారు. చదువు నేర్చుకొనే క్రమంలో ఎన్నో పుస్తకాలు చదివి స్త్రీ ఎంత దారుణ స్థితిలో ఉందో ఆమె అర్థం చేసకున్నారని వెల్లడించారు. స్త్రీ జనోద్ధరణకు సంబంధించిన కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారని చెప్పారు. దీంతో పాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక

- జిల్లాలో 8818 నూతన పింఛన్లు మంజూరు
- ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్, అధికారులు, లబ్ధిదారులు
- నూతన లబ్ధిదారులకు చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్



నూతన లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, అధికారులు

నరసరావుపేట: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ అతిథిగృహంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ఇప్పటివరకు 2,62,413 పింఛన్‌లు ఇస్తుండగా, వాటితో పాటుగా అదనంగా 8,818 పింఛన్‌లు ప్రభుత్వం నూతనంగా మంజూరుచేసిందన్నారు. పింఛన్ల పంపిణీపై ప్రచారాలను, అపోహలను నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. అనంతరం నూతన లబ్ధిదారులకు పింఛన్ పథకం చెక్కు అందజేశారు. మంచి మనసుతో ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, జిల్లా అభివృద్ధి అధికారిణి మహాలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనూష, పలువురు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు..



60 ఏళ్లు పైబడిన వృద్ధులకు సీఎం జగన్ పింఛన్ అందజేయాలనుకోవటం చాలా మంచి నిర్ణయం. ఆ డబ్బులు వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను మోకాలు ఆపరేషన్ చేయించుకున్నా. కొడుకుల మీద ఆధారపడి భార్యాభర్తలం జీవిస్తున్నాం. మాకు ఉపయోగకరంగా ఉంటుంది.
–వట్టికొండ నారాయణ, అన్నారం, రొంపిచర్ల మండలం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నా భర్త చనిపోయాడు. నాకు రేషన్ కార్డు మంజూరు చేసి నూతన పింఛన్‌కు అర్హురాలిని చేశారు. ఇద్దరు పిల్లలు ఉన్న నాకు పింఛన్ మంజూరుతో కొండంత బలం చేకూరింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. సీఎం జగన్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నా.
–దౌపర్తి మీరాబీ, లింగంగుంట్ల, నరసరావుపేట మండలం

చంద్రబాబోయ్..

- తేడా వస్తే వదిలేస్తాడు
- డబ్బుంటే నెత్తినపెట్టుకుంటాడు
- శ్రీనివాస్ అరంగేట్రం కోసమే కార్యక్రమం
- దుర్ఘటన జరగడంతో వదిలేశారు
- శ్రీనివాస్ రాకతో మిగిలిన వారిలో అసహనం
- అండగా నిలబడటానికి ఇష్టపడని నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఇప్పుడు తెలుగుదేశం నాయకులంతా బాబోయ్ చంద్రబాబు అంటున్నారు. అధినేత తీరుపై చెవులు కొరుక్కుంటున్నారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఎన్ఆర్ఐ ఉయ్యూరు శ్రీనివాస్ ఉయ్యూరు ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమం తమకు ఎన్నో గుణపాఠాలు నేర్పిందని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఉయ్యూరు శ్రీనివాస్ ఎన్ఆర్ఐగా ఉంటూ తెలుగుదేశం పార్టీలో చాలా చురుకుగా ఉండేవారు. ఇటీవల పార్టీ కోసం బాగా డబ్బులు ఖర్చు పెడుతుండటంతో ఆయనను ఆంధ్రా రాజకీయాల్లో అరంగేట్రం చేయించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. జన సమీకరణ కోసం అన్నగారి జనతా వస్త్రాలు, చంద్రన్న సంక్రాంతి కానుక పేరు పెట్టారు. ఈ సమావేశానికి చంద్రబాబునాయుడు వస్తానన్న తర్వాతే ఈ ఏర్పాట్లు, హడావిడి చేశారు. శ్రీనివాస్ వెనుక డెల్టాకు చెందిన ఒక మాజీ మంత్రి ఉండి ఈ వ్యవహారం మొత్తం నడిపించినట్లు సమాచారం. ఎప్పుడైతే అనుకోని దుర్ఘటన జరిగి ముగ్గురు మృత్యువాత పడ్డారో అది జరిగిన కొద్దిసేపటికే చంద్రబాబు ఇది ఫౌండేషన్ కార్యక్రమం అని, తాను వచ్చేసిన తర్వాత తొక్కిసలాట చోటుచేసుకుందని మాట మార్చేశారు. ఈ వ్యవహారం తమ పార్టీకి సంబంధం లేనిదని చెప్పుకునే యత్నం చేశారు. దీంతో ఉయ్యూరు శ్రీనివాస్‌ను బలిపశువును చేశారని తెలుగుదేశం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లలో అసహనం

మరోవైపు సీనియర్ నాయకులు కూడా చంద్రబాబు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ పార్టీ కోసం కష్టపడిన వారిని కాదని డబ్బున్న ఎన్ఆర్ఐని తీసుకురావడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో లేకపోయినా పార్టీ కోసం పని చేస్తున్న తమను కాదని ఒక ఎన్ఆర్ఐని రంగంలోకి దించడాన్ని వారు తప్పు పడుతున్నారు. మొదటి నుంచి చంద్రబాబు నైజం అదేనని, డబ్బున్న వారు వస్తే వారిని వాడుకుని వదిలేస్తాడని మరోమారు రుజువైందని చెబుతున్నారు. గుంటూరు పశ్చిమ లేదా పొన్నూరు సీటు ఉయ్యూరు శ్రీనివాస్‌కు ఇస్తారంటూ పార్టీలో ప్రచారం గట్టిగా జరిగింది. దీంతో ఈ కార్యక్రమానికి టికెట్టు ఆశిస్తున్న స్థానిక నేతలు సహకరించలేదు. ఘటన జరిగిన తర్వాత కూడా శ్రీనివాస్‌కు అండగా నిలబడేందుకు వారు ఇష్టపడలేదని సమాచారం.

పేదలే సమిధలు

పట్నంబజార్(గుంటూరు ఈస్ట్): ఈ మొత్తం వ్యవహారంలో పేదలే సమిధలుగా మారారు. తొక్కిసలాటలో చనిపోయిన వారంతా పేదలే. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలకు చెందినవారే. వీరంతా చంద్రబాబు అధికార, ప్రచార దాహానికి బలయ్యారు.

పెద్దదిక్కుపోయి..

గుంటూరు మారుతీనగర్‌కు చెందిన షేక్ బీబీ (50) భర్త బాజీ గతంలో మతి చెందాడు. కుమారుడు మస్తాన్‌వలి మార్బుల్ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్దకుమార్తె బాలిసైదాబీకి పెళ్లయింది. చిన్నకుమార్తె షాకీరాకు పెళ్లి కావాల్సి ఉంది. ఇంటికి ఉన్న పెద్ద దిక్కుగా ఉన్న బీబీ మృతితో ఆ పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బయటకు వెళ్లి తిరిగి రాలేదు

ఏటీఅగ్రహారానికి చెందిన గోపిదేశి రమాదేవి (45) భర్త రాధాకష్ణ బేల్దార్ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం కాగా పెద్దకుమారుడు చంద్రశేఖర్, చిన్నకుమారుడు నాగరాజులు సైతం చిన్న చితక పనులు చేసుకునే జీవనం సాగిస్తున్నారు. గతంలో మిర్చియార్డు వద్ద మిర్చి తొడేలు తీసేందుకు పనికి వెళ్ళే రమాదేవి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన ఆమె మళ్లీ తిరిగి రాలేదు. చంద్రన్నకానుక సభలో జరిగిన తొక్కిసలాటలో మరణించారు. దీంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

ఆధారమైన తల్లి తిరిగిరాని లోకాలకు..

నగరంపాలెం రఘురామ్‌నగర్ గొర్రెలదొడ్డి ప్రాంతానికి చెందిన సయ్యద్ ఆసియా టైలరింగ్ పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తోంది. ఆసియాకు 18 ఏళ్ల వయసులోనే దూరపు బంధువైన రసూల్‌తో వివాహం జరిగింది. వీరికి నజీర్‌బాషా, నస్రీన్‌భాను సంతానం. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నప్పుడే భర్త ఆమెను వదిలి వెళ్ళిపోయాడు. సంతానం కోసం బాధ్యతలు భుజానికెత్తున్న ఆసియా తొలి నుంచి కష్టపడుతూనే వచ్చారు. టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పిల్లలను పదో తరగతి వరకు చదివించారు. కుమారుడు నజీర్‌బాషా అదే ప్రాంతంలోని ఓ దంత వైద్యశాలలో సహాయకునిగా, కుమార్తె లాలాపేటలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ.. తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన చంద్రన్న సంక్రాంతి కానుక కార్యక్రమం ఆమెను తిరిగిరానిలోకాలకు తీసుకెళ్లింది. ఆమె పిల్లలను అనాథలను చేసింది.

చితి మంటల్లోనూ ఒక్కటిగా..

- అమెరికాలో మరణించిన తెలుగు దంపతుల అంత్యక్రియలు పూర్తి
- అశ్రునయనాల మధ్య ఆఖరి మజిలీ
- అమ్మా, నాన్నల భౌతికకాయాలను చూస్తూ దిగాలుగా చిన్నారులు
- కన్నీటి పర్యంతమైన మృతుల తల్లిదండ్రులు



అంతిమయాత్రలో తమ తల్లిదండ్రుల పాదాల వద్ద విషణ్నవదనంతో కూర్చున్న కుమార్తెలు

ప్రత్తిపాడు: ఎన్నో ఆశలు.. మరెన్నో ఆశయాలతో పరాయి దేశం వెళ్లారు. పగలూ రాత్రీ కష్టపడ్డారు. ఇద్దరు పిల్లాపాపలతో జీవితం ప్రశాంతంగా ముందుకు సాగుతున్న వేళ విధికి కన్నుకుట్టినట్లుంది. వారిపై విషం చిమ్మింది. మంచు గడ్డల రూపంలో మృత్యువు కాపు కాసి భార్యాభర్తలిద్దరినీ కానరాని లోకాలకు తీసుకువెళ్లి, వారి ఇద్దరి కుమార్తెలను ఒంటరిని చేసింది. అమెరికాలో దుర్మరణం చెందిన తెలుగు దంపతుల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. వివరాల్లోకి వెళితే

అసలేం జరిగిందంటే..

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రుకు చెందిన నారాయణ, హరిత దంపతులు ఉద్యోగ రీత్యా ఏడేళ్లుగా అమెరికాలోని అరిజోనాలో ఉంటున్నారు. ఈ నెల 26వ తేదీన సెలవు కావడంతో పిల్లలతో కలిసి విహారయాత్రకు వెళ్లిన దంపతులు సరస్సులో గల్లంతై, చివరకు మృత్యుఒడికి చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి మృతదేహాలు అమెరికా నుంచి ఇండియాకు చేరుకున్నాయి. టీసీఎస్ కంపెనీ సహకారంతో సోమవారం ఉదయం అమెరికాలోని డల్లాస్ నుంచి మృతదేహాలను హైదరాబాద్‌కు విమానంలో తరలించారు. అక్కడి నుంచి అంబులెన్సులో పాలపర్రులోని స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా పిల్లలనూ రెండు రోజుల కిందటనే కంపెనీ ప్రతినిధులు ఇండియాకు తీసుకువచ్చి తాతయ్య, నాయనమ్మలకు అప్పగించిన విషయం విధితమే.

బిడ్డా.. ఇక మాకు ఫోన్లు ఎవ్వరు చేస్తారు..

అమెరికా నుంచి స్వగ్రామానికి చేరుకున్న నారాయణ, హరిత దంపతుల మృతదేహాలను చూడగానే ఇళ్లంతా రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన తొమ్మిది రోజుల తరువాత కొడుకు, కోడలిని చూసిన వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. బిడ్డా.. ఇక నుంచి మాకు ఫోన్లు ఎవ్వరు చేస్తారు. నాన్నతో మాట్లాడాలంటావ్.. ఆరోగ్యం జాగ్రత్త అని చెబుతావ్.. ఇక మా గురించి ఆలోచించేది ఎవ్వరు నాయనా అంటూ నారాయణ తల్లి వెంకటరత్నం గుండెలు బాదుకుంటూ రోదించింది. హరిత తల్లిదండ్రులూ కూతురు, అల్లుడిని చూస్తూ భోరున విలపించారు.

అమ్మా,నాన్నలకు పూలు చల్లుతూ.. నమస్కరిస్తూ..

నారాయణ, హరిత పిల్లలు పూజిత, హర్షిత వేదన కూడా మాటల్లో చెప్పలేనిది. ఆ చిన్నారులు బిక్కముఖంతో దిగాలుగా నిర్జీవంగా ఉన్న తల్లిదండ్రులను చూస్తూ కూర్చుండిపోయారు. తాతయ్య, నాయనమ్మలను హత్తుకుని తల్లిదండ్రుల వైపు చూస్తుండటం హృదయ విదారకంగా కనిపించింది. అంతిమయాత్రలోనూ తల్లిదండ్రుల మృతదేహాల పక్కనే కూర్చుని పూలు చల్లుతూ కడవరకూ సాగనంపారు. ముందుగా వారి పాదాలకు నమస్కరించారు.

కదిలివచ్చిన ఊరు

మూడు ముళ్లతో.. ఏడు అడుగులతో అగ్ని సాక్షిగా ఒక్కటైన నారాయణ, హరిత దంపతులు ఆఖరి మజిలీలోనూ కలిసే కానరాని లోకాలకు వెళ్లారు. ఇద్దరి మృతదేహాలను ట్రాక్టర్‌పై పక్కపక్కనే పెట్టి అంత్యక్రియలకు భారీ ఊరేగింపుగా మహాప్రస్థానానికి తరలించారు. ఇద్దరి చితిలను ఒక్కచోటనే పేర్చి అంత్యక్రియలను పూర్తి చేశారు. నారాయణ తండ్రి సుబ్బారావు కుమారుడు, కోడలి చితికి తలకొరివి పెట్టారు. హరిత స్వగ్రామం కూడా ఇదే మండలం కావడం, పిన్నవయస్సులోనే పిల్లలిద్దరినీ ఒంటరిని చేసి హరిత, నారాయణ మరణించడంతో ఆఖరి చూపు చూసేందుకు పెద్ద సంఖ్యలో ఊరుఊరంతా కదిలివచ్చింది. భౌతికకాయాల వద్ద ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు నివాళులర్పించారు.

క్లుప్తంగా

పొట్టకూటి కోసం వస్తే కడుపు కోత మిగిలింది

- 'చైతన్య' భవనంపై నుంచి జారిపడి చిన్నారి మృతి
- తల్లడిల్లిన మాతృమూర్తి



గుంటూరు రూరల్: పొట్టకూటికోసం వచ్చిన మహిళకు కడుపు కోత మిగిలింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న మూడేళ్ల కొడుకు విగతజీవుడయ్యాడు. పసిబిడ్డను చూసి ఆ తల్లి గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరానికి చెందిన కాశీ అన్నపూర్ణ, సురేష్ దంపతులకు ఒక కుమారుడు తేజ(3), కుమార్తె ఉన్నారు. అన్నపూర్ణ మూడు నెలల క్రితం గుంటూరులోని రెడ్డిపాలెం సమీపంలోని చైతన్య కళాశాలలో క్లీనింగ్ పనులు చేసేందుకు ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చింది. కళాశాలలోనే ఉంటూ క్లీనింగ్ పనులు చేస్తోంది. మంగళవారం సాయంత్రం కొడుకు తేజను మూడో ఫ్లోర్‌లోని హాస్టల్‌లో ఉన్న మంచంపై పడుకోబెట్టి తన పనుల్లో నిమగ్నమైంది. నిద్ర నుంచి లేచిన తేజ మంచంపై ఆడుకుంటున్న సమయంలో పక్కనే ఉన్న కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు, తల్లి పసిబిడ్డను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే బాబు మృతి చెందాడని ధ్రువీకరించారు. నల్లపాడు ఎస్‌ఐ నరహరి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదవర్గాలకు బాసటగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



చుండూరులో నూతన పింఛన్లు, ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు (చుండూరు): పేద వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని, వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు నిరంతరం పాటుపడుతోందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మంగళవారం చుండూరులో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లు, ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే, పేదల ఎదుగుదలను చూసి తట్టుకోలేని ప్రతిపక్ష టీడీపీ సంక్షేమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. నేరుగా ప్రజలకే సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదిస్తోందన్నారు. ప్రజలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేని చంద్రబాబు నాయుడు రోడ్డు షోల పేరుతో పేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకునివారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం అని ప్రచారం చేసుకునే చంద్రబాబు నాయుడు తన ప్రచార ఆర్భాటం కోసం కృష్ణా పుష్కరాలు, కందుకూరు రోడ్డు షో, గుంటూరులో చంద్రన్న కానుకల పంపిణీ పేరుతో 40 మంది అభాగ్యుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న యమకింకరుడిలా మారరన్నారు. రాజకీయంగా సమాధి అయిన టీడీపీని అంపశయ్య నుంచి లేపాలన్న కాంక్షతో చంద్రబాబు పేదప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వారి కుటుంబాల్లో చీకటిని నింపుతూ వికృతానందం పొందుతున్నారన్నారు. పేదల బతుకుల్లో ఓ పక్క వైఎస్సార్ సీపీ వెలుగులు నింపుతుంటే, చంద్రబాబు మాత్రం అధికారమే పరమావధిగా ప్రజల ప్రాణాలను హరిస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబెన్, చుండూరు సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి, తహసీల్దార్ బి.కనకదుర్గ, ఎంపీడీఓ సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సదరన్ స్లాట్స్ సచివాలయాలు, మీసేవలో బుక్ చేసుకోండి

నరసరావుపేట: జిల్లాలో నిర్వహించే సదరం క్యాంపుల కోసం ఈవారంలో ఏపీ వైద్య విధానపరిషత్ స్లాట్స్ విడుదల చేయనున్నట్లు జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి, స్థానిక ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ రంగారావు మంగళవారం వెల్లడించారు. గ్రామ, వార్డ్ సచివాలయాలు, మీసేవల్లో స్లాట్స్ బుక్ చేసుకోవచ్చని వివరించారు. స్లాట్స్ వెయిటింగ్‌లిస్ట్‌లో ఉన్నవారు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. వాళ్ళకి ఆధార్ లింకు ఉన్న మొబైల్‌కి మెసేజ్ వస్తుందని, వచ్చిన మెసేజ్ ద్వారా లింక్ డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. సదరం స్లాట్స్ బుకింగ్ చేసుకొనే ముందు వారి ఆధార్‌కు మొబైల్ నెంబర్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ అబ్‌డేట్ అయ్యిందా లేదా అనేది చెక్ చేసుకోవాలన్నారు. జిల్లాలో సదరం క్యాంపులు గవర్నమెంట్ హాస్పిటల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. నరసరావుపేటలో మంగళవారం, శుక్రవారం రెండురోజులు, పెద్దకూరపాడులో మంగళవారం, చిలకలూరిపేటలో బుధవారం, వినుకొండ, గురజాల, మాచర్ల, సత్తెనపల్లిలో శుక్రవారం నిర్వహించనున్నట్లు వివరించారు.

జగనన్న విజయయాత్రలో సైనికులవుదాం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్న విజయయాత్రలో సైనికులవుదామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్‌ఎంఎస్ గార్డెన్స్‌లో చిలకలూరిపేట పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు, వార్డు, గ్రామ వలంటీర్ల సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జగనన్న గొప్ప ఆలోచనా విధానంతో వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పడ్డాయని చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి అందుతున్నాయని చెప్పారు. గర్వించదగ్గ ఈ వ్యవస్థ కారణంగా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం, అపూర్వ ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. వలంటీర్లు ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు పార్టీ ఆదేశాల మేరకు పార్టీ సేవ చేస్తారని పేర్కొన్నారు. ఒక్కో సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లు ఉంటారని చెప్పారు. వీరికి పార్టీ తరపున ఉచిత జీవిత బీమా, ప్రమాద బీమా కల్పించటం జరుగుతుందన్నారు.

అపోహలు నమ్మవద్దు...

సంక్షేమం అంటేనే జగనన్న ప్రభుత్వమని, ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తున్న ప్రభుత్వం తమదన్నారు. చంద్రబాబునాయుడుకి, జగనన్నకు ఎంతో వ్యత్యాసం ఉందని చెప్పారు. చంద్రబాబు కేవలం అసత్య ప్రచారాలపైనే ఆధారపడతారని విమర్శించారు. అందుకు విరుద్ధంగా చెప్పింది చేసి చూసే నైజం జగనన్నదని వెల్లడించారు. సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటే పింఛన్లు తొలగిస్తున్నట్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని, అపోహలను నమ్మవద్దని వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలనలో ఏడాదికి పింఛన్ల కోసం రూ. 400 కోట్లు వెచ్చిస్తే, జగనన్న పాలనలో రూ.1760 కోట్లు వెచ్చిస్తున్నారని వివరించారు. టీడీపీ హయాంలో కేవలం 39 లక్షల మంది పింఛన్ లబ్ధిదాలుంటే నేడు 69 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇది పెంచినట్లో, తొలగించినట్లో చెప్పాలని ప్రశ్నించారు.

కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి జీడీసీసీ బ్యాంకు చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు రాతంశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి పాటు పడాలని చెప్పారు. ఏ సమస్య ఉన్నా పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ పట్టణ, చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాల అధ్యక్షులు పఠాన్ తలహాఖాన్, గుత్తా వేములయ్య, గంటా శంకర్, మద్దూరి కోటిరెడ్డి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీ మియా, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, పార్టీ వివిధ విభాగాల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో కోటప్పకొండలో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కోటప్పకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండను మంగళవారం సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొండదిగువన పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని జలవిహార్, ఘాట్ రోడ్డు మార్గంలోని ప్రకృతి పర్యాటక కేంద్రాలను డీఎఫ్‌ఓ రామచంద్రరావుతో కలిసి పరిశీలించారు. తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఆటవీశాఖ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం కొండపైకి చేరుకుని త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 18వ తేదీన మహాశివరాత్రిని పురస్కరించుకుని జరగనున్న తిరునాళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రధాన ఆలయం చుట్టూ రేకులతో షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఘాట్‌రోడ్డులోని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, విఘ్నేశ్వరుడి విగ్రహాలకు రంగులు వేస్తున్నట్లు తెలిపారు. ఆనందవల్లి అతిథి గృహానికి మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. రూ.75 లక్షలతో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట మేజర్ కెనాల్ వద్ద శివకుటుంబం విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రహదారులపై ప్రత్యేక దృష్టి..

తిరునాళ్ల రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. కొండకావూరు, పమిడిమర్రు మీదగా జెఎన్‌టీయూ కళాశాల వద్ద హైవేకు చేరుకునే విధంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. పెట్లూరివారిపాలెం–కోటప్పకొండ రహదారి కొండకు చేరుకునే భక్తులకు, కొండకావూరు–పమిడిమర్రు రహదారి కొండనుంచి వెళ్లే భక్తులు వినియోగించుకునేలా వన్‌వేను అమలుచేస్తామన్నారు. దీంతో పాటు కోటప్పకొండకు వచ్చే అన్ని లింక్‌రోడ్లు అభివృద్ధి చేసేందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.51 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. వారంలో ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 45రోజుల ముందే పనులను ప్రారంభించినట్టు తెలిపారు. యల్లమంద వద్ద బ్రిడ్జి నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేమూరి గోపి, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ముక్కు వెంకటేశ్వరరెడ్డి, మట్లా లింగారెడ్డి, మూరా సాంబిరెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, కనకా పుల్లారెడ్డి, వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువ చేసే గుట్కా స్వాధీనం

దాచేపల్లి: పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న గుట్కా, మద్యం కేసులను పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి వస్తున్న వాహనంలో గుట్కా, మద్యం తరలిస్తున్నట్లు ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందింది. పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద ఎస్‌ఈబీ అధికారులు వాహనాలు తనిఖీలు చేశారు. ఓ వాహనంలో 168కిపైగా గుట్కా బస్తాలు, 5 కేసుల తెలంగాణ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీటి విలువ సుమారుగా రూ.10 లక్షలకుపైగా ఉంటుందని సమాచారం

టీడీపీ మనుగడ ప్రశ్నార్థకం

గుంటూరు ఈస్ట్: చంద్రన్న కానుక సభ ప్రాంగణంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి నివాసాలకు మంత్రులు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు వెళ్లి రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు పబ్లిసిటీ పిచ్చి పట్టిందన్నారు. గుంటూరులో మరణాలకు చంద్రబాబే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనపై ప్రజలంతా చంద్రబాబును అసహ్యించుకుంటున్నారని చెప్పారు. టీడీపీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కళాధర్, జోగారావు ఎన్నిక



ఎం.కళాధర్



పి.జోగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) గుంటూరు జిల్లా చైర్మన్‌గా ఎం.కళాధర్, సెక్రటరీ జనరల్‌గా పి.జోగారావు ఎన్నికయ్యారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏపీఆర్‌ఈఐటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డి.మధుసూదనరావు ఎన్నికల అధికారిగా జరిగిన కార్యవర్గ సమావేశంలో భాగంగా జిల్లా ఫ్యాప్టో శాఖకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫ్యాప్టో జిల్లా కో–చైర్మన్లుగా పి.ప్రసాద్, ఎం.సాంబశివరావు, ఉప ప్రధాన కార్యదర్శులుగా జి.మోహనరావు, ఖాలీద్, జి.వేళాంగిణిరాజు, కార్యదర్శులుగా ఎండీ నజీర్, అబ్దుల్ షాజీర్‌ను ఎన్నుకున్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ సంస్థ (డీఎల్‌టీసీ/ఐటీఐ)లో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నైపుణ్య శిక్షణ కల్పించామని పేర్కొన్నారు. రెండో విడతలో అధిక డిమాండ్ కలిగిన అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ తరగతులను ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలపాటు ఉచిత శిక్షణ కల్పించిన అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. కామర్స్ సబ్జెక్టులతో ఇంటర్, డిగ్రీ అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు తమ ప్రతినిధి ఆర్‌పీవీ మణిదీప్‌ను 8074607278 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం రీ–సర్వే పనులు, ప్రభుత్వ అవసరాల కోసం సేకరించాల్సిన వ్యవసాయ భూములు, ఎస్సీ శ్మశానవాటికల కోసం భూముల గుర్తింపు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల పనులను వెంటనే చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రెవెన్యూ, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత పనులు జరుగుతున్న తీరును జిల్లా జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం మరింత పెంచాలని సూచించారు. రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో జరుగుతున్న ప్రభుత్వ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా జాప్యం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల అధికారులు పనులు చేపడుతున్న తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తి స్థాయిలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం, పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, భూ సర్వే, లాండ్ రికార్డ్స్ ఏడీ నాగేశ్వర్, కలెక్టరేట్ ఏఓ అనీల్‌కుమార్, రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

5, 6న వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు ఖేలో ఇండియా ఎస్ఎస్ఆర్ యాప్ వినియోగం, ఫిట్ ఇండియా అంశాలపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య మంగళవారం తెలిపారు. నరసరావుపేట డివిజన్‌లోని వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నెల 5వ తేదీ శంకరభారతిపురం జెడ్పీ హైస్కూల్, సత్తెనపల్లి డివిజన్‌లోని వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నెల 6న సత్తెనపల్లిలోని బాలికోన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. శిక్షణ తరగతులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. శిక్షణ తరగతులకు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాలలో పనిచేసే పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు హాజరు కావాలని స్పష్టం చేశారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు



గురజాల: దొంగనోట్లు తయారీ చేసి చెలామణి చేస్తున్న నలుగురు నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ మొహర జయరాం ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు నవంబర్ 17వ తేదీ 2022లో చర్లగుడిపాడు గ్రామానికి చెందిన ఉద్దగిరి అలేఖ అనే యువకుడి ఇంట్లో సోదా చేయగా పోలీసులను చూసి నిందితుడు గోడదూకి పారిపోయాడని తెలిపారు. వెంటనే గ్రామ పెద్దల సమక్షంలో అలేఖ ఇంట్లో సోదాలు చేయగా రూ.10,70,000 దొంగనోట్లు, వాటి తయారీకి వాడే కంప్యూటర్‌తో పాటు ప్రింటర్‌లు, దొంగనోట్లు ఎలా తయారు చేయాలనే విషయాలు రాసుకున్న పుస్తకాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అలేఖను పోలీసులు విచారణ చేశారన్నారు. రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన ఉడుతూరి వెంకట నారాయణరెడ్డి, సంకురాత్రి యలమంద, పెయ్యేటి శంకర్ దొంగనోట్లను అలేఖ వద్ద నుంచి తీసుకొని మార్కెట్‌లో చెలామణి చేస్తున్నట్లు సమాచారం లభించింది. దీంతో మంగళవారం రాత్రి పల్లెగుంత గ్రామంలో రైల్వే బ్రిడ్జి వద్ద వెంకట నారాయణరెడ్డి, యలమంద, శంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.48,50,000 దొంగనోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ కె.ప్రభాకర్, ఎస్ఐ టి.అశోక్ బాబు, సైదా నాయక్, సైదులు, కమల్‌నాథ్, శివశంకర్, పూర్ణచంద్రరావు, ఎన్‌కే రాజును డీఎస్పీ అభినందించారు.